# లక్షకోట్ల ప్యాకేజీ ఇవ్వాలి

- రావుడు, పోవుడు కాదు.. ప్రయోజనం ఉండాలి
- 'పాలమూరు'కు జాతీయ హోదా కల్పించాలి
- కృష్ణానీటిలో వాటా తేల్చేటైం లేదా..?
- పీఎం కాదు.. ఎంతమంది జేజమ్మలు వచ్చినా ఏమీ చేయలేరు
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ప్రధానమంత్రి నరేంద్రమోదీపై మంత్రి ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ, చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 30 : ''పాలమూరు ప్రజలు హుషారైంద్రు.. వలసలు మాని పది మందికి పని కల్పించే స్థితికి చేరుకున్నరు. పీఎం మోదీ తెలంగాణకు ఎలాంటి మేలు చేకూర్చకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసం సభలు, సమావేశాలు పెడుతున్నరు. పాలమూరు కరువు తీరేలా ప్రాజెక్టును కట్టుకుంటుంటే జాతీయ హోదా ఇవ్వకుండా ఏ మొఖం పెట్టుకొని పీఎం పాలమూరుకు వస్తున్నారని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మంత్రి మాట్లాడారు. మోదీ మహబూబ్‌నగర్‌కు ఇప్పటివరకు మూడుసార్లు వచ్చి పెట్టిన చోటే మళ్లీ సభలు పెడుతూ ప్రజలకు ఏం మేలు చేకూర్చారని ప్రశ్నించారు. ఏవో రెండు మాటలు చెప్పి ప్రచారం చేసి వెళ్తున్నారు తప్పా.. మహబూబ్‌నగర్‌కు ఎలాంటి ఉపయోగం లేదని దుయ్యబట్టారు. కరివెన, ఉదండాపూర్, ఐటీ టవర్, కేసీఆర్ ఎకో అర్బన్‌పార్కుతోపాటు 2వ తేదీన 26వేల ఎకరాల్లో జంగల్ సఫారీ ప్రారంభించి ప్రపంచ నలుమూలల నుంచి పాలమూరును చూసి వెళ్లేలా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. మన్యంకొండ ఆలయ అభివృద్ధి కోసం నివేదికలు పంపిస్తే ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా తిప్పి పంపిన విషయాన్ని పాలమూరు ప్రజలు మర్చిపోలేదని గుర్తు చేశారు. మోదీ వచ్చినా, ఎంతమంది జేజమ్మలొచ్చినా ఏమీ చేయలేరని, ప్రజల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ప్రతి క్షణం పాటుపడుతున్నదని తెలిపారు. పాలమూరు పక్కనే కృష్ణానది పారుతున్నా తాగడానికి చుక్క నీరు ఇవ్వలేదని, స్వరాష్ట్రంలో ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. వారు అధికారంలో ఉన్న 18 రాష్ట్రాల్లో ఏ పథకాలు అమలు చేస్తున్నారో మోదీ చెప్పాలని డిమాండ్ చేశారు. స్వరాష్ట్రం ఏర్పడ్డాక అనతి కాలంలోనే అభివృద్ధి సాధించామన్నారు. అత్యధికంగా ట్యాక్స్‌లు చెల్లిస్తూ కేంద్రానికి అండగా నిలబడితే, కేంద్రం మాత్రం తమకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. తెలంగాణ దేశంలో అంతర్భాగమే అని ప్రతిసారి రాష్ట్రాన్ని కించపర్చేలా మాట్లాడడం మోదీకి అలవాటైందని అసహనం వ్యక్తం చేశారు. గడిచిన పదేండ్లలో అందరం కుటుంబసభ్యులుగా ఉన్నామని, గిప్పుడొచ్చి మత కల్లోలాలు సృష్టిస్తే సహించమన్నారు. పాలమూరుకు వచ్చి పోవడం కాదు.. లక్ష కోట్ల ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభల్లో ప్రజలకు మాయమాటలు చెప్పడం మోదీకి అలవాటుగా మారిందని, ఇక్కడికి వచ్చే అర్హత ఆయనకు లేదన్నారు. తల్లిందడ్రులను తిట్టి చాయి పోస్తే ఎవరూ మర్చిపోరని, ఇది మోదీ గమనించాలన్నారు. అసెంబ్లీలో తెలంగాణ ప్రభుత్వం అమోదించిన బిల్లులను వెంటనే అమోదించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్‌చైర్మన్ గణేశ్, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, సుదీప్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

### 'పాలమూరు' ఎంతో అభివృద్ధి చెందింది

పాలమూరు, సెప్టెంబర్ 30 : మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని అల్లీపూర్, జమిస్తాపూర్, తెలుగుగూడెం, బొక్కలోనిపల్లి, అప్పాయిపల్లి, ఓబులాయపల్లి, ఓబులాయపల్లి తండా, కోటకదిర, మన్యంకొండ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. అల్లీపూర్‌లో జీపీ భవనం, డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రారంభోత్సవం, జమిస్తాపూర్‌లో సీసీరోడ్లు, బొక్కలోనిపల్లిలో బీటీ రోడ్డు ప్రారంభం, అప్పాయిపల్లిలో డ్వాక్రా భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్ల ప్రారంభోత్సవం, ఓబులాయపల్లిలో డబుల్ బెడ్రూం ఇండ్లు, సీసీ రోడ్డు వంటి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తున్నారని అన్నారు. గతంలో గ్రామాల్లో ఎలాంటి పరిస్థితి ఉండేదో ప్రజలే గమనించాలన్నారు. మాయమాటల చెప్పే వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పీఆర్‌ఎల్‌ఐతో మండలంలోని చెరువులు ఎల్లప్పుడూ అలుగు పారిస్తామని అన్నారు. గతంలో కేసీఆర్ ఎంపీగా ఉన్నప్పుడు గ్రామాల్లోకి వచ్చానని, అప్పట్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడేవారని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. స్వరాష్ట్రంలో హైదరాబాద్‌కు దీటుగా పాలమూరును మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ నర్సింహారెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గిరిధర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ, ఎంపీపీ సుధ, వైస్ ఎంపీపీ అనిత, రెవెన్యూ అధికారులు, మండల అధికారులు, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు అల్లాఉద్దీన్, మండల కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, క్రీడాకారిణి గుత్తాజ్వాల, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ, ఎస్పీ నరసింహ

# త్వరలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు

- క్రీడాశాఖ మంత్రి డా.వీ.శ్రీనివాస్‌గౌడ్
- మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ప్రారంభం

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబర్ 30 : ప్రతి నియోజకవర్గంలో స్టేడియం, ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణం నిర్మించిన ఏకైక రాష్ట్రం తెలంగాణేనని క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. శనివారం మహబూబ్‌నగర్‌లోని ప్రధాన స్టేడియం ఆవరణలో రూ.9.10కోట్లతో నిర్మించిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాలతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూత్పూర్ మండలంలో స్టేడియం పనులు జరుగుతున్నాయన్నారు. వాలీబాల్ అకాడమీ అకాడమీ తీసుకొచ్చామని, త్వరలో సింథటిక్ ట్రాక్ నిర్మిస్తామని మంత్రి తెలిపారు. స్వరాష్ట్రంలో రూ.50కోట్లు క్రీడలకు ఖర్చు చేసినట్లు వివరించారు. స్టేడియం గ్రౌండ్ నుంచి నెక్లెస్‌రోడ్‌కు అనుసంధానం చేస్తామని తెలిపారు. ఇలాంటి వ్యక్తి క్రీడాశాఖ మంత్రిగా ఉండడం మన అదృష్టమని అంతర్జాతీయ క్రీడాకారిణి గుత్తాజ్వాల పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటు క్రీడాకారులకు వరమన్నారు. పిల్లలు క్రీడల వైపు ఆసక్తి చూపేలా వారి తల్లిదండ్రులు కృషి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అనంతరం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను మంత్రి, గుత్తాజ్వాలతో కలిసి ప్రారంభించి షటిల్ ఆడి క్రీడాకారులను ఉత్సహపర్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ యాదయ్య, కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నరసింహ, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, డీవైఎస్‌వో శ్రీనివాస్, ఈఈ నరేందర్‌రెడ్డి, పీఈటీలు, క్రీడా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే ఆల జన్మదినం

- ఆనవాయితీగా భూత్పూర్ శివాలయంలో పూజలు



భూత్పూర్ శివాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆల దంపతులు

భూత్పూర్/దేవరకద్ర, సెప్టెంబర్ 30 : దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యేతోపాటు ఆయన సతీమణి మంజుల, కూతురు పూజలు చేశా రు. తన పుట్టినరోజు సందర్భంగా వచ్చిన ప్రతి కార్యకర్తకూ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేక్ కట్‌చేసి తన సతీమణితోపాటు మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, ఎంపీపీ శేఖర్‌రెడ్డికి తినిపించారు. అనంతరం అన్నాసాగర్‌లో తన తల్లి వరలక్ష్మి ఆశీర్వాదం పొంది కార్యకర్తలను కలిశారు. అదేవిధంగా కొత్తమొల్గర, మద్దిగట్లలో కార్యకర్తలు ఎమ్మెల్యే జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. దేవరకద్రలోని శ్రీనివాసగార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హోంశాఖ మంత్రి మహమూద్ అలీ ఎమ్మెల్యే ఆలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో రై తుబంధు సమితి మండల అధ్యక్షుడు నర్సింహాగౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ స భ్యులు, ముడా డైరెక్టర్లు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కల్తీ మద్యం అమ్మితే పీడీ యాక్ట్

- మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, సెప్టెంబర్ 30 : స్వరాష్ట్రంలో గీత కార్మికుల సంక్షేమంతోపాటు ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మద్యం అమ్మకాలను కట్టుదిటం చేశామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. శనివారం మహబూబ్‌నగర్‌లోని ఎస్వీఎస్ దవాఖాన వెనుక నూతనంగా నిర్మించిన ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది కృషి వల్ల ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతున్నదన్నారు. అన్ని శాఖలతోపాటు ఎక్సైజ్ శాఖకు గౌరవం వచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా జిల్లా కార్యాలయాన్ని ప్రశాంత వాతావరణంలో నెలకొల్పామన్నారు. ఈ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు ఎక్కువగా పనిచేస్తున్న కారణంగా ఎక్సైజ్ కమిషనర్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి వారికి సంబంధించిన సమస్యలను తీర్చాలని ఆదేశించారు. ఈ కార్యాలయం పక్కనే భవిష్యత్‌లో అతిథిగృహం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కల్తీ మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే వారిపై పీడీ యాక్టు పెడతామని హెచ్చరించారు. ఎంతటి వారైనా సరే వదిలిపెట్టబోమని, అవసరమైతే జైలులో పెడతామని మంత్రి స్పష్టం చేశారు. ఐదేండ్లలో ఎన్ని ఇబ్బందులు, అవాంతరాలు వచ్చినా అందరికీ పదోన్నతులు, బదిలీలు కల్పించామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నరసింహ, జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దత్తు రాజుగౌడ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, గ్రంథాలయాల సంస్థ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్, డీసీసీబీ ఇన్‌చార్జి వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, కౌన్సిలర్లు, ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా నీటి వాటా,
# జాతీయ హోదా ఎక్కడ?

- ఏ మొఖం పెట్టుకొని పాలమూరుకు వస్తున్నారు?
- కేసులతో పనులు అడ్డుకొని అభివృద్ధిపై మాటలా!
- ప్రధాని మోదీపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): ''పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేస్తామని గత ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. కృష్ణానీళ్లలో వాటా తేల్చరు. పాలమూరు, కాళేశ్వరం ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వరు. తెలంగాణపై అక్కసు కక్కుతారు. తెలంగాణలో ఓట్లు, సీట్లు కావాలి కానీ అభివృద్ధి పట్టదా'' అని ప్రధాని మోదీపై నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ధ్వజమెత్తారు. తిమ్మాజిపేట మండలం పోతురెడ్డిపల్లిలో పదేండ్ల ప్రజాప్రస్థానం యాత్రలో భాగంగా విలేకరులతో మాట్లాడారు. ఒకప్పుడు పాలమూరు జిల్లా వలసలకు కేరాఫ్‌గా నిలిస్తే.. ఇప్పుడు అభివృద్ధికి కేరాఫ్‌గా మారిందన్నారు. పదేండ్ల కింద పల్లెల్లోకి ఎమ్మెల్యేలు వెళ్తే ఖాళీ బిందెలతో నిరసనలు తెలిపే మహిళలు ఇప్పుడు పూలమాలలు, బోనాలు, మంగళహారతులతో ఆహ్వానిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ పట్టుదలతో పెండింగ్ ప్రాజెక్టులతోపాటు పీఆర్‌ఎల్‌ఐ, కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు పూర్తి చేశామన్నారు. గత నాయకులు తెలంగాణ, పాలమూరు పేరు చెప్పుకొని ఓట్లు, సీట్లు పొందారే తప్పా చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. గతంలో పీఆర్‌ఎల్‌ఐ ప్రాజెక్టును పూర్తి చేస్తానన్న మోదీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఇంకా ఎన్‌జీటీ, సుప్రీం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

కోర్టుల్లో కేసులతో పనుల జాప్యానికి కారకులయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ మొఖం పెట్టుకొని పాలమూరు వస్తున్నారో మోదీ ప్రజలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌పై ఉన్న ప్రేమ తెలంగాణపై లేదని దుయ్యబట్టారు. తెలంగాణ ఏర్పాటుపై కూడా ప్రధాని అక్కసు వెళ్లగక్కడం హేయమన్నారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే పాలమూరు, కాళేశ్వరం ప్రాజెక్టులకు జాతీయ హోదా ప్రకటింపజేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణపై విషం కక్కే బీజేపీకి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కావేరీ జలాల వివాదంలో తమిళనాడు, కర్ణాటకలో రాజకీయ పార్టీలు ఒక్కటైతే తెలంగాణలో మాత్రం కాంగ్రెస్, బీజేపీలు పదవుల కోసం పాకులాడుతున్నాయని విమర్శించారు. ఇక్కడి ప్రతిపక్షాల నాయకులకు శ్రీశైలం, జూరాల ప్రాజెక్టుల నీటిసామర్థ్యం తెలియదని, ప్రాజెక్టు ఎక్కడ కడితే ఎంత ప్రయోజనమో కనీస అవగాహన లేదన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, ప్రతిపక్షాలకు మళ్లీ అరణ్యవాసం తప్పదని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి పట్టని పార్టీలకు ఓట్లు, సీట్లు ఎందుకని నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్‌కే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. తన యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్, ప్రజల అండతో తాను హ్యాట్రిక్ విజయం సాధిస్తానన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ రఘునందన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, నాయకులు వేణుగోపాల్‌గౌడ్, ప్రదీప్, విజయ్, కుర్మయ్య, వెంకటస్వామి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.